క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే బీఎమ్మార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్

తాండూరు టౌన్: వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ 13వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ వరాల శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాలుగేళ్లుగా వార్డు పరిస్థితి ఇలాగే ఉందని, నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కౌన్సిలర్ కోరారు.

నూతన కమిటీ నియామకం



వాసవి మహిళా సంఘం నూతన సభ్యులు

తాండూరు టౌన్: శ్రీ వాసవి మహిళా సంఘం తాండూరు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. తాండూరు శాఖ నూతన అధ్యక్షురాలిగా కోట్రిక నాగలక్ష్మి, ఉపాధ్యక్షురాలు గుబ్బ ప్రగతి, ప్రధాన కార్యదర్శిగా మంకాల్ స్వప్న, ఉప కార్యదర్శిగా తాళ్లపల్లి కవిత, కోశాధికారిగా సింగంశెట్టి శోభతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులు, సలహాదారులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఆర్యవైశ్య పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నామన్నారు. సంఘం అభ్యున్నతితో పాటు సామాజిక కార్యక్రమాల ద్వారా మహిళలకు అండగా నిలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, సంఘం ప్రతినిధులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పార్టీలు వేరైనా.. సంకల్పం ఒక్కటే

వారంతా వేర్వేరు పార్టీలకు చెందిన వారు. అయినా వారి సంకల్పం సామాజిక సేవే లక్ష్యం. అదే వీరిని ఒకే వేదికపై ఇలా కలిపింది. కాంగ్రెస్, బీజేపీ రాజకీయ ప్రతినిధులుగా ఉన్న నలుగురు మహిళలు, తాండూరులో జరిగిన శ్రీవాసవి మహిళా సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. వీరిలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కల్వ సుజాత, అదే పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కందనెల్లి శోభ, బీజేపీ మహిళామోర్చ రాష్ట్ర కార్యదర్శి సాహు శ్రీలత, అదే పార్టీ మహిళామోర్చ జిల్లా అధ్యక్షురాలు యాష్కి శిరీష ఉన్నారు. పార్టీలు వేరైనా.. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి, తోటి మహిళలకు అండగా ఉంటూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటామని మహిళామణులు తెలిపారు.

లక్ష్యం మేరకే మొక్కలు

ఎంపీడీఓ రాములు



నర్సరీ మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బంట్వారం: రానున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని ఎంపీడీఓ రాములు అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధి మద్వాపూర్ గ్రామంలో నర్సరీని పరిశీలించి మాట్లాడారు. గత ఏడాదికి సంబంధించి నర్సరీల్లో మిగిలిన మొక్కలను కన్వర్షన్ చేయాలని ఆదేశించారు. నర్సరీలో కనీసం 15 రకాల మొక్కలను పెంచాలని, అవి ఎండిపోకుండా నీరు పట్టాలని చెప్పారు. అనంతరం ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై సమీక్షించారు. అవసరమైన పనులు చేపట్టడంతో పాటు కూలీలకు సకాలంలో డబ్బులు అందేలా చూడాలని పేర్కొన్నారు. ఎంపీఓ విజయ్ కుమార్, మద్వాపూర్ పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, ఈజీఎస్ ఈసీ శ్రీనివాస్, టీఏలు అశోక్‌రెడ్డి, జంగయ్య, హన్మంత్, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాండూరు రూరల్: తాండూరు మండలంలో మంగళవారం సాయంత్రం కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. మండల పరిధి అంతారం గ్రామ సమీపంలో 33 కేవీ విద్యుత్ లైన్‌పై ఓ దుప్పటి పడింది. దీంతో గౌతపూర్, కోటబాసుపల్లి, కరన్‌కోట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 20 గ్రామాలకు సుమారు నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్పందించిన విద్యుత్ అధికారులు.. మరమ్మతులు చేపట్టి, సరఫరాను పునరుద్ధరించారు.

పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత

కుల్కచర్ల: పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ఎక్కడ పారిశుద్ధ్యం లోపించకుండా తగిన చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రజలందరూ స్వచ్ఛతను పాటించాలని సూచించారు.

ఊపిరి పీల్చడం కష్టమే!

వాయు కాలుష్యంతో వాహనదారుల ఇక్కట్లు

- గౌతపూర్ చెక్‌పోస్ట్ నుంచి గోపన్‌పల్లి వరకు దుమ్మూధూళి
- చించోళి రోడ్డు పరిస్థితి ఇంతే..



గౌతపూర్-గోపన్‌పల్లి రోడ్డులో లారీ వెళ్తుండటంతో గాలిలో లేచిన దుమ్ము



దుమ్ములో ద్విచక్రవాహన దారుల పయనం

తాండూరు రూరల్: తాండూరు ప్రాంతం వ్యాపారానికి కేంద్ర బిందువు. మండల పరిధిలో సిమెంట్ కర్మాగారాలు, నాపరాతి గనులు, పాలిషింగ్ యూనిట్లు అనేకంగా ఉన్నాయి. నిత్యం ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు వందల లారీల్లో సిమెంట్, నాపరాతిని తరలిస్తుంటారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఆయా ప్రాంతాల్లో ప్రధాన రహదారులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఈ రోడ్లలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్న క్రమంలో దుమ్ము ధూళి గాలిలోకి లేస్తోంది. దీంతో వాహనదారులు, పరిసర ప్రాంత ప్రజలకు ఊపిరి పీల్చుకోవడం కష్టంగా మారింది.

మట్టిపోసి వదిలేశారు..

మండలంలోని కరన్‌కోట్ సమీపంలో రెండు, కర్ణాటక సరిహద్దులో ఓ సిమెంట్ ఫ్యాక్టరీ ఉంది. ఓగిపూర్ సమీపంలో వందల నాపరాతి గనులు ఉన్నాయి. గౌతపూర్ చెక్‌పోస్ట్ నుంచి కరన్ కోట్ వరకు గత ప్రభుత్వం రోడ్డు మరమ్మతులకు రూ.12 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో గోపన్‌పల్లి నుంచి కరన్‌కోట్ రోడ్డు వరకు ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతులు చేశారు. కానీ గౌతపూర్ చెక్‌పోస్ట్ నుంచి గోపన్‌పల్లి వరకు సదరు కాంట్రాక్టర్ మట్టిపోసి వదిలేశారు. ఇలా వదిలేసి సుమారు 8 నెలలు కావస్తోంది. ఈ రోడ్డులో ప్రతి రోజు వందల సంఖ్యలో లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఫలితంగా రోడ్డుతో పాటు, పరిసర ప్రాంతాలు పూర్తిగా దుమ్ముతో నిండి ఉన్నాయి.

అధ్వానంగా చించోళి రోడ్డు

చించోళి మార్గంలోని అల్లాపూర్ నుంచి కోత్లాపూర్ వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. మిర్యాణ్, మల్కాపూర్ నుంచి నిత్యం లారీల్లో నాపరాతిని తరలిస్తుంటారు. ఇలా భారీ వాహనాలు వెళ్తుండటంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రాంపూర్ గేటు వద్ద రోడ్డులో దుమ్ము లేస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే చించోళి రోడ్డు నేషనల్ హైవే రహదారి కింద మంజూరు కావడంతో ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఊపిరితిత్తులకు క్యాన్సర్!

రోడ్ల మరమ్మతులకు నోచుకోకపోవడంతో దుమ్మూధూళితో ఇబ్బంది పడుతున్నాం. ఊపిరి తిత్తుల సమస్య వస్తుందని, క్యాన్సర్ బారిన పడతారని వైదులు హెచ్చరిస్తున్నారని పరిసర ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దుమ్మును భరించలేక.. వయా ఎల్మకన్నె, గౌతపూర్ మీదుగా తాండూరుకు వెళ్తున్నామని కరన్‌కోట్, చంద్రవంచ, చిట్టిఘనాపూర్, బెల్కటూర్ గ్రామ ప్రజలు తెలిపారు.

ముందుకు రాని కాంట్రాక్టర్



గౌతపూర్ నుంచి కరన్‌కోట్ రోడ్డు మరమ్మతులకు రూ.12 కోట్లు మంజూరయ్యాయి. 80 శాతం పనులు పూర్తయ్యాయి. కేవలం గౌతపూర్ చెక్‌పోస్ట్ నుంచి గోపన్‌పల్లి వరకు మాత్రమే రోడ్డు రిపేరు చేయాల్సి ఉంది. అయితే కాంట్రాక్టర్‌కు రూ.10 కోట్ల బిల్లు రావాల్సి ఉన్నందున వారు పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. అది చించోళి రోడ్డు నేషనల్ హైవే కింద ఉంది.

– శ్రీనివాస్, డీఈ, ఆర్అండ్‌బీ, తాండూరు డివిజన్

ధర్మాసుపత్రుల్లో మెరుగైన సేవలు

- అపోహలు వీడి.. ఇక్కడే పురుడు పోసుకోండి
- హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్



బాలింతకు ఆరోగ్య కిట్ అందజేసిన హెల్త్ ఆఫీసర్

కుల్కచర్ల: ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సురక్షిత ప్రసవాలు జరుగుతాయని, కాబోయే తల్లులు ఇక్కడే కాన్పు చేయించుకోవాలని మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని సర్కారు దవాఖానలో బాలింత శిరీషకు మాత శిశు ఆరోగ్య కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధర్మాసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని, అపోహలు వీడి.. గర్భం దాల్చిన మొదలు నెలలు నిండే వరకు ఇక్కడే వైద్య పరీక్షలు చేయించుకొని, పురుడు పోసుకోవాలని సూచించారు. ప్రైవేటు హాస్పిటల్లో డెలివరి చేయించుకోవడం వలన ఆర్థిక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని వెల్లడించారు.

4న ఎస్పీ కార్యాలయం ముట్టడి

- పరిగి డీఎస్పీని సస్పెండ్ చేయాలి
- కరపత్రం ఆవిష్కరించిన నేతలు



కరపత్రాన్ని ఆవిష్కరించిన నేతలు

తాండూరు టౌన్: పరిగి డీఎస్పీ కరుణసాగర్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మార్చి 4న ఎస్పీ కార్యాలయం ముట్టడి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుగ్గప్ప, వెంకటయ్య, ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు కె.చంద్రయ్యలు మాట్లాడారు. దోమ మండలం ఉదన్‌రావు పల్లికి చెందిన సయ్యద్ అయూబ్‌కు చెందిన భూమిని రాజకీయ నాయకులు కబ్జా చేశారని, దీనిపై నాటి ఎస్ఐ రవి, డీఎస్పీ కరుణసాగర్ రెడ్డిలకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఆరోపించారు. అంతే కాకుండా కబ్జాకు పాల్పడిన వారికి అండగా నిలిచి, బాధితులను భయభ్రాంతులకు గురిచేసిన డీఎస్పీని వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. బాధితుడికి అన్యాయం జరిగిందని, దీనికి నిరసనగా.. ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నామన్నారు.

'మా జోక్యం ఉండదు'

డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి



పరిగి: సివిల్ తగాదాల్లో పోలీసుల జోక్యం ఉండబోదని డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రోజులుగా వార్తా పత్రికల్లో ప్రజా సంఘాల నేతలు తనపై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని చెప్పారు. దోమ మండల పరిధి తిమ్మాయిపల్లి భూ విషయంలో చట్ట ప్రకారమే ముందుకు వెళ్తున్నామని తెలిపారు. భూ వివాదాలు ఎక్కువగా రెవెన్యూ, కోర్టు పరిధిలో ఉంటాయని, వాటి పట్ల పోలీసులు కలగజేసుకోరని పేర్కొన్నారు. తిమ్మాయిపల్లి భూమికి సంబంధించి ఎస్ఐ డబ్బులు తీసుకున్నాడని పలువురు ఆరోపిస్తున్నారని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

'కొండా' సేవలు అభినందనీయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న బీజేపీ శ్రేణులు

కుల్కచర్ల: నిరుపేద విద్యార్థుల కోసం మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు, ఆ పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఘనపురం వెంకటయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కొండా పుట్టిన రోజును పురస్కరించుకుని 86మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2,500 (కొండా పంపిణీ చేసిన) నగదును సహాయంగా అందజేశారు. ఇందులో మాజీ సర్పంచ్ జానకిరాం, బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్, జెకెఎంఆర్ ఫౌండేషన్ పరిగి కోఆర్డినేటర్ రాంచంద్రయ్య, జిల్లా నాయకులు కాటనిపల్లి అంజిలయ్య, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి హన్మంతు, బీజేవైఎం మండల అధ్యక్షుడు మైపాల్, నాయకులు కర్ణయ్య, నరేష్, పాండు నాయక్, పోచయ్య, బీరయ్య ఉన్నారు.

350 మందికి వైద్య పరీక్షలు

బంట్వారం: మండల కేంద్రం బంట్వారంలో మంగళవారం వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 350 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు భరత్‌రెడ్డి, విశ్వతేజ్, అజయ్, స్మిత, చంద్రమోహన్, సీఓ వంశి, కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆపదొస్తే 100కు డయల్ చేయండి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పోలీసులు

తాండూరు రూరల్: ఎవరికైనా, ఏదైనా ఆపద వస్తే వెంటనే 100కు డయల్ చేయాలని హెడ్‌కానిస్టేబుల్ అమీనొద్దీన్ సూచించారు. మంగళవారం మండల పరిధి చెంగోల్ గ్రామంలో సైబర్ క్రైంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కానిస్టేబుల్ మాట్లాడారు. ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని చెప్పారు. ఫోన్లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీం నంబర్‌కు ఫోన్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రఘువేందర్, మురళీధర్, నాయకులు రాము యాదవ్ ఉన్నారు.

బహిరంగ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



కుల్కచర్ల: సభకు వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

కుల్కచర్ల: రంగారెడ్డిజిల్లా చేవెళ్లలో జరిగిన అధికార పార్టీ కాంగ్రెస్ చేపట్టిన బహిరంగ సభకు మంగళవారం డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల నుంచి శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఇందులో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, బీసీసెల్ మండల అధ్యక్షుడు మహేశ్, యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్య, సోషల్ మీడియా తాలుకా కోఆర్డినేటర్ భాస్కర్, మండల కోఆర్డినేటర్ శ్రీనివాస్, నాయకులు వెంకటయ్య, బచ్చిరెడ్డి, వెంకటయ్య, నర్సింహ నాయక్, వెంకటేశ్, బాబు ఉన్నారు.

ధారూరులో..

ధారూరు: కాంగ్రెస్ బహిరంగ సభకు మండల పరిధి నుంచి ఆ పార్టీ మండల అధ్యక్షుడు విజయభ్కార్‌రెడ్డి అధ్వర్యంలో శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఇందులో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు విజయభ్కార్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, బాబాఖాన్, రాములు, హన్మంత్‌రెడ్డి, రాంరెడ్డి, లాల్ అహ్మద్, రాజేందర్, హన్మయ్య, రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



వికారాబాద్ పట్టణం నుంచి..



ధారూరు: కుక్కింద నుంచి..

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

- సమయం ఉదయం 9 గంటల నుంచి 12 వరకు పరీక్ష
- 30 నిమిషాల ముందే ఎగ్జామ్ సెంటర్లకు చేరుకోవాలి
- చీఫ్ సూపరింటెండెంట్ రమేష్
- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు



పెద్దేముల్: పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దేముల్: నేటి నుంచి ఇంటర్‌మీడియెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని, అందుకు తగిన ఏర్పాటు పూర్తి చేశామని చీఫ్ సూపరింటెండెంట్ రమేష్, డిపార్ట్‌మెంట్ అధికారి వెంకన్నలు తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ జర్నప్పలు ఇంటర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి మొత్తం 2,691 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతాయని, 30 నిమిషాల ముందే విద్యార్థులు కేంద్రానికి చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యం అయినా అనుమతి లేదని స్పష్టంచేశారు. పరీక్ష కేంద్ర వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, విద్యార్థులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్ష రాసుకోవాలని సూచించారు.

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే క్రిమినల్ చర్యలు

తాండూరు టౌన్: తాండూరు పట్టణ పరిధిలో ఎనిమిది పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇందులో 4,500 మంది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని కస్టోడియన్లు మల్లినాథప్ప, కృష్ణయ్యలు తెలిపారు. విద్యార్థులను ఉదయం 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని, ఎవరైనా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా.. డిబార్ చేయడంతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు.

పరీక్ష కేంద్రాలు..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏ, బి సెంటర్లు, సిద్ధార్థ, చైతన్య, సింధు బాలికల, అంబేడ్కర్ పారామెడికల్ కళాశాలలతో పాటు రాజీవ్ గృహకల్ప సమీపంలోని టీఎస్ మైనార్టీ కళాశాల, టీఎస్ సోషల్ వెల్ఫేర్ కళాశాలల్లో సైతం పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

కుల్కచర్లలో..



కుల్కచర్ల: రామలింగేశ్వర కళాశాలలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కుల్కచర్ల: విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ రామకృష్ణ నిర్వాహకులకు సూచించారు. ఇంటర్ పరీక్ష నేపథ్యంలో మండల కేంద్రంలోని వివేకానంద, రామలింగేశ్వర కళాశాలలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు ఆయా సెంటర్లను పరిశీలించారు. ఇదిలా ఉండగా.. రామలింగేశ్వర కళాశాల కేంద్రంలో 244మంది, వివేకానంద కాలేజీలో 204మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ కామేశ్వరి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ అప్పగింత



సెల్ ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్ఐ గిరి

పెద్దేముల్: పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను పోలీసులు.. సాంకేతిక పరిజ్ఞానంతో కనుగొని బాధితుడికి అప్పగించారు. ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. బషీరాబాద్ మండలం జీవన్గీ గ్రామానికి చెందిన నితిన్ 20 రోజుల క్రితం పెద్దేముల్‌కు వస్తూ తన సెల్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ యాప్ ద్వారా మొబైల్ ఆచూకీ తెలుసుకొని, స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మంగళవారం ఠాణాలో బాధితుడు నితిన్‌కు ఎస్ఐ ఫోన్ అందజేశారు.

మహిళలకు ఉచిత శిక్షణ

వికారాబాద్ అర్బన్: గ్రామీణ ప్రాంత మహిళలకు కాస్ట్యూమ్స్, ఇమిటేషన్, వన్‌గ్రామ్ జ్యూవెలరీ తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూనియన్ బ్యాంక్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, స్వర్ణ భారత్ ట్రస్ట్ (ముచ్చింతల్) ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ నెల 28 నుంచి 13 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆసక్తిగల మహిళలు 19 నుంచి 45 సంవత్సరాల వయసు లోపు ఉండాలన్నారు. శిక్షణ సమయంలో ఉచితంగా హాస్టల్ వసతి, భోజన సౌకర్యం , యూనిఫాంతో పాటు టూల్ కిట్స్ ఇవ్వనున్నట్లు వివరించారు. జ్యూవెలరీ శిక్షణకు దరఖాస్తు చేసుకునే వారు రేషన్, ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ సైజు ఫొటోలతో జీఎస్ఆర్ కృష్ణ, డైరెక్టర్ యూనియన్ బ్యాంక్, స్వర్ణ భారత్ ట్రస్ట్, ముచ్చింతల్, రంగారెడ్డి జిల్లాలో సంప్రదించవచ్చని సూచించారు. మరింత సమాచారం కోసం 9391487797, 9177141712, 6301890681, 9618534720 నంబర్లను సంప్రదించాలన్నారు.

పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలి

శిక్షణా కార్యక్రమంలో సిబ్బందికి వైద్యుల సూచన



కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్ఈఓ వెంకటేశ్వర్. చిత్రంలో ఎంపీడీఓ, తహసీల్దార్

ధారూరు: ఇటుక బట్టీలు, నిర్మాణ రంగం, కోళ్ల ఫారాల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయాలని డాక్టర్లు సుష్మ, శివకుమార్, హెచ్ఈఓ వెంకటేశ్వర్లు ఆశ, ఏఎన్ఎంలకు సూచించారు. మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఐకేపీలో ధారూరు, నాగసముందర్ పీహెచ్‌సీల వైద్యులు ఆశ, ఏఎన్ఎం, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడారు. మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో.. బూత్, గృహ సందర్శన ద్వారా ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేయాలని చెప్పారు. తొలుత కార్యక్రమం గురించి గ్రామాల్లో ప్రచారం చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ సాజిదాబేగం, ఎంపీడీఓ నర్సింహులు మాట్లాడుతూ.. కార్యక్రమానికి తమవంతు సహకారం ఉంటుందని, జీరో నుంచి 5 ఏళ్ల వయసున్న 5,425 మంది చిన్నారులు ఉన్నారని, బూతుల వారీగా ప్రతి ఒక్కరికీ పోలియో డ్రాప్స్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ షఫీఉల్లా, హెచ్ఈ రేణుకుమార్, సూపర్‌వైజర్ ఉమా, హెల్త్ అసిస్టెంట్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం పాలన దినోత్సవం

కొడంగల్‌రూరల్: మండలంలోని రావల్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా స్వయం పాలన దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. కలెక్టర్‌గా లక్ష్మి, డీఈఓగా శ్రీకాంత్, హెచ్ఎంగా నందిని, మరో పది మంది ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. తోటి వారికి పాఠాలు చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్యామ లమ్మ, ఉపాధ్యాయులు అనంత లక్ష్మి, ముత్యప్ప, అశోక్, గీత పాల్గొన్నారు.



స్వయంపాలనలో విద్యార్థులు